ప్రజాశక్తి

మంగళవారం 26 డిసెంబరు 2023 5

శ్రీకాకుళం

కోవిడ్ కలకలం

- జిల్లాలో మూడు కేసులు నమోదు
- అప్రమత్తమైన వైద్యారోగ్యశాఖ అధికారులు
- సర్వజన ఆస్పత్రిలో 20 పడకలు ఏర్పాటు

కోవిడ్ రూపాంతరం మార్చుకుని కమ్ముకొస్తోంది. కనుమరుగైందనుకున్న మహమ్మారి మళ్లీ కోరలు చాచే పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలో రెండు రోజుల వ్యవధిలో మూడు కేసులు నమోదు కావడం కలకలం సృష్టించింది. కోవిడ్ కేసులు వెలుగు చూస్తుండడంతో వైద్యారోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. శీతాకాలం, పండగల సీజన్ అయిన ప్రస్తుత తరుణంలో తాజా హెచ్చరికలతో ప్రజలు అప్రమత్తం కావాల్సి ఉంది. మాస్కు ధారణ, భౌతిక దూరం, శుభ్రత పాటించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో రెండు రోజుల వ్యవధిలో మూడు కోవిడ్ కేసులు నమోదయ్యాయి. మెళియాపుట్టి మండలం దుర్భలాపురానికి చెందిన 73 ఏళ్ల వృద్ధుడు కోవిడ్ లక్షణాలతో ఈనెల 16న శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేరాడు. విటిఎం పరీక్షలు నిర్వహించగా, ఈనెల 24వ తేదీన కోవిడ్ పాజిటివ్‌గా తేలింది. ప్రస్తుతం సర్వజన ఆస్పత్రి కోవిడ్ ప్రత్యేక వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నారు. కోవిడ్ వేరియంట్ నిర్ధారణ కోసం విజయవాడలోని ల్యాబ్‌కు పంపారు. సోమవారం మరో ఇద్దరు కోవిడ్ బారిన పడ్డారు. కొత్తూరు మండలం కుద్దిగాంకు చెందిన 60 ఏళ్ల వ్యక్తి, శ్రీకాకుళం నగరం కంపోస్టు కాలనీకి చెందిన 50 ఏళ్ల మహిళకు కోవిడ్ సోకింది. వీరిద్దరికీ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. కోవిడ్ కేసులు నమోదైన నేపథ్యంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. సర్వజన ఆస్పత్రిలో ప్రత్యేకంగా 20 పడకలను ఏర్పాటు చేశారు. కోవిడ్ లక్షణాలతో వచ్చే వారికి వెంటనే పరీక్షలు, చికిత్స అందించేలా చర్యలు చేపట్టారు. జలుబు, జ్వరం, దగ్గు, గొంతునొప్పి, న్యుమోనియా ఇబ్బందులున్న వారికి ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి బి.మీనాక్షి సోమ వారం సర్వజన ఆస్పత్రిలో పర్యటించి కోవిడ్ ప్రత్యేక వార్డులు, పరీక్షలను పరిశీలించారు. కోవిడ్ వ్యాప్తి నేపథ్యంలో పడకల సంఖ్యను మరింత పెంచుతామని చెప్పారు. కోవిడ్ పరీక్షల సంఖ్యను మంగళవారం నుంచి పెంచుతామని తెలిపారు.

కోవిడ్ పరీక్షలు పెంచాలి

కోవిడ్ కేసులు నమోదైన నేపథ్యంలో ప్రభుత్వపరంగా కొన్ని చర్యలు తీసుకోవాల్సి ఉంది. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పరీక్షల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉంది. కోవిడ్ లక్షణాలున్న వారితో పాటు వారి కాంటాక్టును గుర్తించి పరీక్షలు చేయాలి. ప్రతి సచివాలయం పరిధిలో ఉన్న వైద్య సిబ్బందితో కోవిడ్ లక్షణాలు ఉన్న వారిని గుర్తించి సచివాలయం పరిధిలో పరీక్షలు ఉద్ధృతం చేయాలి. జిల్లా సర్వజన ఆస్పత్రితో పాటు అన్ని ఆస్పత్రుల్లో పడకలను అందుబాటులోకి తీసుకురావాలి. ఆక్సిజన్ సిలిండర్లు, వెంటిలేటర్లు, కాన్సన్‌ట్రేటర్లు ఇతర వైద్య పరికరాలను వినియోగంలోకి తీసుకురావాలి. కోవిడ్ వ్యాప్తి విస్తృతం కాకుండా సచివాలయ వైద్య సిబ్బందితో నిరంతర పర్యవేక్షణ ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉంది.

జాగ్రత్తలు తీసుకోకుంటే ముప్పే

కోవిడ్ కేసులు నమోదైన నేపథ్యంలో ప్రజలు వ్యక్తిగతంగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముంది. క్రిస్మస్, సంక్రాంతి తరుణంలో ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు ఊపందుకోనున్నాయి. బస్సులు, రైళ్లు రద్దీగా మారనున్నాయి. మార్కెట్లు, వస్త్ర దుకాణాలు జనంతో కిటకిటలాడనున్నాయి. అయ్యప్ప మాలధారణ వేసిన వారు కేరళ వెళ్లి వస్తున్నారు. కేరళలో అత్యధికంగా కేసులు నమోదవుతుండడంతో కొంత ఆందోళన వ్యక్తమవుతోంది. వైరస్ వ్యాప్తికి శీతాకాలం అనుకూలమైనందున వీలైనంత మేర అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కోవిడ్ ఏ రకమైనా సరే... మాస్కులు ధరించడం, భౌతిక దూరం పాటించడం, చేతులు శుభ్రం చేసుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. సాధ్యమైనంత రాకపోకలు తగ్గించుకోవాలని చెప్తున్నారు. జలుబు, దగ్గు, జ్వరం లక్షణాలు ఉంటే సత్వరమే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సలహా ఇస్తున్నారు. ఫలితాలు వచ్చే వరకు హోమ్ ఐసోలేషన్‌లో ఉండడం ద్వారా వ్యాప్తికి అడ్డుకట్ట వేయొచ్చని చెప్తున్నారు.

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ మీనాక్షి

దుర్భలాపురంలో వైద్య పరీక్షలు

మెళియాపుట్టి : మండలంలోని దుర్భలాపురంలో కోవిడ్ కేసు నమోదు కావడంతో వైద్య సిబ్బంది గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కోవిడ్ సోకకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తచర్యలను వివరించారు. గ్రామంలో ఎవరికీ జ్వరాలు, జలుబు లక్షణాల్లేవని స్థానిక వైద్యాధికారి గ్రీష్మ తెలిపారు.

సందడిగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లావ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలను సోమవారం సందడిగా నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే చర్చిల్లో వేడుకలు ప్రారంభమయ్యాయి. ఏసుక్రీస్తును స్తుతిస్తూ గీతాలను ఆలపించారు. శ్రీకాకుళం చిన్నబజారులోని తెలుగు బాప్టిస్టు చర్చి, ఉమెన్స్ కాలేజ్ రోడ్డులోని క్రిస్టియన్ వర్షిప్ సెంటర్, కోడి రామ్మూర్తి స్టేడియం సమీపంలోని సెయింట్ జాన్ లూథరన్ చర్చి, డగ్లస్ స్కూల్ క్యాంపస్‌లోని కీన్‌స్టోన్ చర్చి, పాత శ్రీకాకుళంలోని రార్డ్ అసెంబ్లీ చర్చి, పురుషుల డిగ్రీ కళాశాల సమీపంలోని సహాయ మాత (ఆర్‌సిఎం) చర్చి, టౌన్‌హాల్ వద్ద సెయింట్ థామస్ చర్చితో పాటు జిల్లావ్యాప్తంగా పలు చర్చిల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగరంలోని చిన్న బజారు రోడ్డులో బాప్టిస్టు చర్చిలో ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, దమ్మలవీధిలోని చర్చిలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, ఇచ్ఛాపురంలోని బాప్టిస్టు చర్చిలో ఎమ్మెల్యే బెందాళం, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ పాల్గొని కేక్ కట్ చేశారు. ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు గొండు శంకర్ శ్రీకాకుళం నగరంలో దుస్తులు పంపిణీ చేశారు. క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్లు క్రీస్తు సందేశం చదివి వినిపించారు. పలుచోట్ల పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.

చిన్నారులకు కేకును తినిపిస్తున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

యంత్రాల ద్వారా ధాన్యం నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

నిబంధనల మేరకే ధాన్యం కొనుగోలు

డిఎస్ఒ వెంకటరమణ

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

ప్రభుత్వ నిబంధనల మేరకు రైస్‌మిల్లర్లు రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారి డి.వెంకటరమణ అన్నారు. సోమవారం స్థానిక రైస్‌మిల్లులో ధాన్యం నిల్వలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వాహనాల్లో తెచ్చిన ధాన్యాన్ని శాంపిల్స్ తీసి యంత్ర పరికరాల ద్వారా నాణ్యత, తేమశాతం, బియ్యాన్ని పరిశీలించగా అధికంగా నూకలు, మట్టితో కూడిన వ్యర్థాలు 30శాతం వరకు వచ్చాయన్నారు. మిల్లర్లకు, రైతుకు నష్టం లేకుండా రెండు కేజీలు అదనంగా వసూళ్లు చేయవచ్చునన్నారు. నాణ్యత కలిగిన ధాన్యం రైతు తీసుకువస్తే 80 కేజీలకు మించి తీసుకోరాదని స్పష్టం చేశారు. ధాన్యం క్వాలిటీని బట్టి రైతులు, మిల్లర్లు సమిష్టిగా నిర్ణయాలు తీసుకోవాలని, అదనంగా రెండు కేజీలు ప్రభుత్వ నిబంధన కాదన్నారు.

మిల్లర్లు కూడా రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని, ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా మిల్లర్ల యూనియన్ నాయకులు అధికారులతో మాట్లాడుతూ తాము ఎఫ్‌సికి బియ్యం పంపినప్పుడు 67శాతం దిగుబడితో కూడిన నాణ్యత ఇస్తున్నామని, అందులో 15 శాతం బ్రోకెన్ రైస్‌కు మాత్రమే అనుమతి ఇస్తున్నారని, తాము రైతు వద్ద కొనుగోలు చేసిన ధాన్యంలో 30శాతం బ్రోకెన్ రైస్ ఉంటుందన్నారు. అలాంటప్పుడు 67 శాతం నాణ్యత ఎఫ్‌సిఐకి ఎలా ఇవ్వగలమని ఆందోళన వ్యక్తం చేశారు. ఈయన వెంట జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాసరావు, సిఎస్‌డిటి కె.రాము, విఆర్ఒ కూర్మారావు ఉన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన మాస్కుల పంపిణీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కరోనా కొత్త వేరియంట్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ చైతన్య కార్యక్రమాలు చేపడుతోంది. మండలంలోని బుడుమూరు సంత, పరిసర గ్రామాల్లో చైతన్య రథం, పోస్టర్లను పంపిణీ చేపట్టారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు శ్రీకాకుళం నగరంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం వద్ద సుమారు వెయ్యి మందికి మాస్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా నివారణకు రెడ్‌క్రాస్ చైతన్య రథం ద్వారా వాలంటీర్లు, యూత్ రెడ్‌క్రాస్ ద్వారా కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు. రద్దీగా ఉండే ప్రదేశాల్లో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కో-ఆర్డినేటర్ కె. సత్యనారాయణ, సిబ్బంది సతీష్, పవన్ పాల్గొన్నారు.

మరిన్ని వార్తల కోసం
epaper.prajasakti.com

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సమగ్ర శిక్షలో అన్ని విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జెఎసి జిల్లా అధ్యక్షులు పి.మురళీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెగ్యులరైజ్ తదితర సమస్యల పరిష్కారం కోరుతూ సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జెఎసి అధ్వర్యాన సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారానికి ఆరో రోజుకు చేరింది. సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేసి రాష్ట్రవ్యాప్తంగా 25 వేల మంది సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెలోకి వెళ్లాల్సిన పరిస్థితిని ప్రభుత్వమే కల్పించిందని విమర్శించారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి, రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగులందరికీ హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. మినిమం టైమ్ స్కేల్, హెచ్‌ఆర్ఎ, డిఎ అమలు చేసి, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న పార్ట్ టైమ్ విధానాన్ని రద్దు చేసి, ఫుల్ టైమ్ కాంట్రాక్టు విధానాన్ని అమలు చేసి వేతనాలు పెంచాలన్నారు. అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చి మినియం ఆఫ్ టైం స్కేల్ అమలు చేయాలని తెలిపారు. రూ.పది లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్, గ్రాట్యుటీ సదుపాయంతో పాటు ఇపిఎఫ్, ఇఎస్ఐ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా ఒకటో తేదీకి వేతనాలు చెల్లించాలని, సంవత్సరానికి సరిపడే బడ్జెట్ ఒకేసారి విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అరసవల్లిని సందర్శించిన సినీ నటి సురభి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సినీ నటి సురభి పురాణిక్ సందర్శించారు. నగరంలోని ఒక షాపు ప్రారంభోత్సవానికి సోమవారం హాజరైన ఆమె ముందుగా అరసవల్లి చేరుకుని ఆలయాన్ని సందర్శించారు. ఆమెకు ఆలయ మర్యాదలతో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతించారు. ఆలయంలో స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివెట్టి మండపంలో ఆమెకు స్వామివారి శేష వస్త్రాలతో పాటు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులతో పాటు పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

జ్ఞాపికను స్వీకరిస్తున్న నటి సురభి పురాణిక్

ట్రిపుల్ ఐటి వైద్యాధికారిగా అరుణ బాలాజీ

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

ట్రిపుల్ ఐటి వైద్యాధికారిగా డాక్టర్ బి.అరుణ బాలాజీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు ట్రిపుల్ ఐటి డైరెక్టర్ కె.వెంకట ధనబాలాజీ శుభాకాంక్షలు తెలిపారు. సుమారు 67 శాతం విద్యార్థినులు ఉన్న ట్రిపుల్ ఐటిలో వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించే దిశగా ఈ నియామకం చేపట్టినట్లు తెలిపారు. బాధ్యతల స్వీకరణ అనంతరం అరుణ బాలాజీ మాట్లాడుతూ ఎండి, డిజిఒగా హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో విద్యనభ్యసించినట్లు తెలిపారు. అనంతరం బిహెచ్‌పివి, బిహెచ్‌సిఎల్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించానన్నారు. కార్యక్రమంలో ఒఎస్‌డి సుధాకర్‌బాబు, పరిపాలనా అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహనకృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ ఆసిరినాయుడు, డీన్ వెల్ఫేర్ రవి ఉన్నారు.

రేపు గెస్ట్ ఫ్యాకల్టీకి ఇంటర్వ్యూ

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ అధ్య ర్యంలో జిల్లాలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో 2023-24 విద్యా సంవత్సరానికి కంచిలి బిఆర్.అంబేద్కర్ గురుకులం (బాలురు)లో ఖాళీగా ఉన్న పిజిటి మ్యాథ్స్(పురుషులు), మందస బాలికల గురుకులంలో ఖాళీగా ఉన్న జెఎల్ జువాలజీ (మహిళా అభ్యర్థి) గెస్ట్ ఫ్యాకల్టీ ప్రాతిపదికన ఉపాధ్యాయ పోస్టుల భర్తీ నిమిత్తం ఈ నెల 27న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ఎపి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా సమన్వయకర్త ఎన్. బాలాజీ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. అసక్తి గల పురుష, మహిళా అభ్యర్థులు బయోడేటాతో పాటు పిజి, బిఇడి, టెట్ (క్వాలిఫైడ్) ఒరిజినల్ సర్టిఫికెట్లుతో జిల్లా కేంద్రంలో ఆదివారం పేటలో గురుకుల విద్యాలయ సంస్థ జిల్లా సమన్వయాధికారి కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే డెమోకు హాజరుకావాలని, మరింత సమాచారం కోసం 08942-279826, 97017 36362, 9000314209 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

అంగన్వాడీల వినూత్న నిరసనలు

- 14వ రోజుకు చేరిన సమ్మె
- సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె
- స్పష్టం చేసిన అంగన్వాడీ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ అమలు తదితర సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారానికి 14వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా అంగన్వాడీలు మోకాళ్లపై నిల్చొని, ఒంటి కాలిపై నిల్చొని దండం పెడుతూ, క్రిస్మస్ సందర్భంగా కేక్ కట్ చేసి, శిలువ ఆకారంలో నిల్చొని, భిక్షాటన, చెవిలో పువ్వులు పెట్టుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు.

ఇచ్ఛాపురంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ కారును అంగన్వాడీ కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో ఆమె కారు దిగి అంగన్వాడీల వద్దకు వచ్చారు. 13 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, తమ సమస్యలను సిఎం జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. అంతకుముందుకు మోకాళ్లపై కూర్చొని, రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టి నిరసన తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని అర్బన్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద యూదులు ఏసుక్రీస్తుకు శిలువ వేస్తే, జగన్ అంగన్వాడీలకు వేస్తున్నారని శిలువ ఆకారంలో అంగన్వాడీలు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. తమ సమస్యలు పరిష్కరించేలా ఏసుక్రీస్తు జగన్ మనసును కరిగించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి, నాయకులు టి.రాజేశ్వరి, కె.సంధ్య, ఎన్.పార్వతి, శ్యామల తదితరులు పాల్గొన్నారు. పలాసలో కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద క్రిస్మస్ కేకు కట్ చేసి నిరసన తెలిపారు. అంగన్వాడీల పోరాటానికి విశ్రాంత ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారి, సామాజిక కార్యకర్త జుత్తు తాతారావు, వజ్రపుకొత్తూరు యుటిఎఫ్ నాయకులు బి.చిట్టిబాబు సంఘీభావం తెలిపారు. రూ.ఐదు వేలు చొప్పున ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, జ్యోతి, భవాని, సునీత తదితరులు పాల్గొన్నారు. టెక్కలిలో అంగన్వాడీలు ఒంటి కాలిపై నిల్చొని దండం పెడుతూ నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్.షణ్ముఖరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఆదిలక్ష్మి, రమణమ్మ, రాజ్యలక్ష్మి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు. కొత్తూరులో రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా కళ్లు తెరవాలని, ముఖ్యమంత్రి జగన్‌కు మంచి బుద్ధి రావాలని క్రిస్మస్ కేకు కట్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు హేమలత, లక్ష్మి, ధనలక్ష్మి, వ్య.కా.స నాయకులు సిర్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. రణస్థలం మండలంలోని పలు గ్రామాల్లో అంగన్వాడీలు భిక్షాటన చేపట్టి నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కె.సుజాత తదితరులు పాల్గొన్నారు. ఎచ్చెర్లలో సమ్మె శిబిరంలో క్రిస్మస్ కేకు కట్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, అంగన్వాడీ యూనియన్ నాయకులు బి.శారద వై.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. పొందూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో కేక్ కట్ చేసి పంచి పెట్టారు. యూనియన్ నాయకులు జ్యోతిలక్ష్మి, నాగరత్నం, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు. ఆమదాలవలసలో క్రిస్మస్ సందర్భంగా కేకును కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. అనంతరం ఐసిడిఎస్ కార్యాలయం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తమకు కనీస సమాచారం ఇవ్వకుండా అంగన్వాడీ సెంటర్ల తాళాలను పగులగొట్టారని వారిపై కేసులు నమోదు చేయాలని ఎస్ఐ కృష్ణకు ఫిర్యాదు చేశారు. అంగన్వాడీ కేంద్రాల ఇంటి యజమానులు తలుపులు బాగు చేయాలని తమకు అడుగుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు పంచాది లతాదేవి, పి.భూలక్ష్మి, ఎం.లత తదితరులు పాల్గొన్నారు. కోటబొమ్మాళిలో ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సుధ, సిఐటియు నాయకులు హెచ్.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : ఒంటికాలిపై నిల్చొని దండం పెడుతూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

కొత్తూరు : కేక్ కట్ చేసి నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

శ్రీకాకుళం అర్బన్ : శిలువ ఆకారంగా నిల్చొని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

పలాస : ఆర్థికసాయం అందజేస్తున్న తాతారావు

ఇచ్ఛాపురం : కొవ్వొత్తుల ప్రదర్శన చేపడుతున్న అంగన్వాడీ కార్యకర్తలు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ఇచ్ఛాపురం : వేడుకల్లో పాల్గొన్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

పోలాకి : నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఇచ్ఛాపురం : పట్టణంలోని గొల్లవీధిలోని బాప్టిస్ట్ చర్చిలో అధ్యక్షుడు ప్రత్తి విజయా కుమార్, కార్యదర్శి ఎం.వి.ఎస్.ఎన్.మూర్తి ఆధ్వర్యాన నిర్వహించిన క్రిస్మస్ వేడుకలో ఎమ్మెల్యే బెందాళం అశోక్, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, జెసిఎస్ అధ్యక్షులు సాలిన ఢిల్లీరావు, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్, వార్డు కౌన్సిలర్ ప్రదీప్‌కుమార్, పత్తి విజయకుమార్, టిడిపి నాయకులు ఆశి లీలారాణి, కాళ్ల దిలీప్‌కుమార్, కాళ్ల జయదేవ్, నందిగాం కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పోలాకి : మండలంలోని ఉరజాంలోని లివింగ్ గాడ్ మినిస్టర్ చర్చిలో ఫాస్టర్లు ఆర్.అప్పలనాయుడు, ఆర్.వినోద్‌కుమార్, పోలాకిలో డోల రోడ్‌లోని ఇమాన్యుయల్ చర్చిలో ఫాస్టర్ తూలుగు సత్యతేజ ఆధ్వర్యాన క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డి.ప్రసాదరాజు పాల్గొన్నారు.

కవిటి: క్రీస్తు బోధనలు అనుసరణీయమని సర్పంచ్ పూడి లక్ష్మణరావు అన్నారు. కవిటిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో బెందాళం శివ ప్రసాద్, మురళీకృష్ణ, నారాయణ, నూకరాజు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: టెక్కలిలోని లివింగ్ స్టన్ చర్చిలో పాస్టర్ కణితి అబ్రహం ఆధ్వర్యాన నిర్వహించిన క్రిస్మస్ వేడుకలలో నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు పాల్గొని క్రిస్టియన్ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కిల్లి రామ్మోహనరావు, మధు, ఆట్ల రాహుల్‌కుమార్ పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని పారాపురంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో తూర్పుకాపు చైర్మన్ మామిడి శ్రీకాంత్ పాల్గొని కేక్‌ను కట్ చేశారు. అనంతరం పేదలకు అన్నదానం నిర్వహించారు. రెండు వేల మందికి దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం మాజీ చైర్మన్ తోట నందకుమార్, వైసిపి నాయకులు గోగుల వరప్రసాదరావునాయుడు, టి.కిరణ్‌కుమార్, కె.వలిసినాయుడు, పిన్నింటి రామారావునాయుడు, జడ్డు రామకృష్ణ, వై.గోవిందరావు, సాయి పాల్గొన్నారు.

టెక్కలి : స్థానిక లివింగ్ స్టోన్ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో డిసిసి అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు, మండలంలోని నర్సింగపల్లి, అయోధ్యాపురం, బొప్పాయిపురం, పాతనౌపడ, పెద్దరోకళ్లపల్లి, అక్కవరం పంచాయతీల్లో సర్పంచ్‌లు రౌతు జయమోహన్, బగాది హరి, గుజ్జు మోహన్‌రెడ్డి, దల్లి లోకేశ్వరరెడ్డి, రాంపాత్రుని మురళి, పొట్నూరు భూలక్ష్మి, కిసాన్ సంఘం జిల్లా అధ్యక్షులు కోత మధుసూదనరావు, ఫారెస్టర్ రెవరెండ్ కణితి అబ్రహం పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని గొట్టిపల్లి పంచాయతీ ఉల్లిగూడ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొన్నారు. అనంతరం గిరిజనులకు దుస్తులను పంపిణీ చేశారు. ముందుగా కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. చిన్నారుల నృత్యాలను తిలకించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, సర్పంచ్ పి.మధుబాబు, వైసిపి నాయకులు ఎం.చక్రపాణి, జి.ఆనందరావు, పంకాజ్‌దాస్ పాల్గొన్నారు.

సోంపేట : బారువలోని చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, సర్పంచ్ ఎర్ర రజిని, వైస్ ఎంపిపి జి.శ్రీను, కె.సత్యం, ఎ.లోకనాథం పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: న్యూ ఫ్రెండ్స్ ఆఫ్ ది ఎర్త్ వాలంటీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని అనాథ బాలికలకు బట్టలు, దుప్పట్లు, పండ్లు, క్రిస్మస్ కేకులు పంపిణీ చేశారు. ఆర్గనైజేషన్ కార్యదర్శి సీనియర్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ శ్రీనివాస పట్నాయక్ అందజేశారు. కార్యక్రమంలో జివిఎంసి ప్రతినిధి మంత్రి రాధా రమాదేవి, డాక్టర్ వినీల బాయ్ పట్నాయక్, తేజ, అశ్విని, ఏంజెల్, దివ్య, శరణ్ నాయుడు పాల్గొన్నారు.

ఆమదాలవలస: ఏసుక్రీస్తుతోనే ప్రజలకు దైవిక ప్రేమరక్షణ కలుగుతుందని పాస్టర్ జి.కృపావరం అన్నారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా పట్టణంలో కృష్ణాపురంలో గ్రేస్ గాస్పల్ చర్చ్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా బ్రదర్ జి.ఇమ్మాన్యూల్ పలువురితో కలిసి గీతాలాపనలు చేశారు. అనంతరం పాస్టర్ కృపావరం దంపతులు పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డాక్టర్ పి.తాతయ్యలు, రామకృష్ణ పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

పొందూరు: స్థానిక పార్వతీనగర్ కాలనీలో సిఎంసి చర్చిలో చర్చి కాపరి సిహెచ్ ప్రభుదాస్, మిరాకిల్ యూత్ మినిస్ట్రీస్ చైర్మెన్ జీవన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పలువురు గాయకులు స్తుతి గీతాలను ఆలపించారు. అలాగే రాపాక కూడలి, కొంచాడ, జోగన్నపేట, లుట్టపేట, లోలుగు తదితర గ్రామాల్లోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను జరిపి కేకును కట్ చేసి మిఠాయిలను పంచిపెట్టారు.

టెక్కలి రూరల్ : కేక్ కట్ చేస్తున్న కృపారాణి, వాణి

దుస్తులు పంపిణీ చేస్తున్న శ్రీనివాస పట్నాయక్

ఆమదాలవలస : దుస్తులు పంపిణీ చేస్తున్న కృపావరం దంపతులు

కొత్తూరు : దుస్తులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

వృద్ధుడు అదృశ్యం

ఆనందరావు

నందిగాం : మండలంలోని నరేంద్రపురం పంచాయతీ పాలవలస కు చెందిన బలగ ఆనందరావు అనే వృద్ధుడు అదృశ్యమయ్యాడని ఎస్ఐ మహ్మద్ అమీర్ ఆలీ సోమవారం తెలిపారు. ఆనందరావు ఈనెల 18న ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రైనా చేరలేదన్నారు. కుటుంబ సభ్యులు ఆందోళన చెంది పరిసరాలు, బంధువుల ఇళ్లల్లో వాకబు చేశారని తెలిపారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో ఆనందరావు కుమారుడు చంద్రశేఖరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారని, దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

108లో ప్రసవించిన గర్భిణి

108లో గర్భిణి ప్రసవం

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ పారిశ్రామిక వాడకు చెందిన కె.రోజా 9 నెలల గర్భిణి కావడంతో సోమవారం వేకువజామున 3 గంటలకు పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చిన్న పిల్లలు, మత్తు వైద్యులు లేకపోవడంతో సిబ్బంది ప్రథమ చికిత్స నిర్వహించి 108లో జిల్లా సర్వజనాస్పత్రికి రిఫర్ చేశారు. ఉదయం 6 గంటల సమయంలో టెక్కలి సమీపంలో పురిటి నొప్పులు అధికం కావడంతో 108 సిబ్బంది ప్రథమ చికిత్స నిర్వహించారు. దీంతో ఆమె పండంటి మగ బిడ్డను ప్రసవించింది. అనంతరం టెక్కలి జిల్లా ఆస్పత్రికిలో చేర్పించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

జెడ్‌పి చైర్‌పర్సన్ పరామర్శ

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం మున్సిపాలిటీలోని 17వ వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ మెరుగు రాజేశ్వరి భర్త మెరుగు వెంకటరెడ్డి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ మృతుడి కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈమె వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, టౌన్ జెసిఎస్ అధ్యక్షులు సాలిన ఢిల్లీరావు ఉన్నారు.

ఎమ్మెల్సీ...

ఇచ్ఛాపురం : మండలంలో బొడ్డబడ సర్పంచ్ రఘునాథ్‌పాడి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు పరామర్శించారు. ఈయన వెంట మున్సిపల్ చైర్మన్ ప్రతినిధి పిలక సంతు, 6వ వార్డు కౌన్సిలర్ పరపటి కోటిరెడ్డి, సంతోష్, తేజారెడ్డి, ఉదయ్‌బెహరా ఉన్నారు.

ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

శ్మశానవాటిక నిర్మాణానికి సహకరించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని సీపన్నాయుడుపేట గ్రామంలో శ్మశాన వాటిక అభివృద్ధికి సహకరించాలని పార్లమెంటుసభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడును గ్రామస్తులు కోరారు. ఎంపీ కార్యాలయంలో ఆయనను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. దశాబ్దాల కాలంగా సీపన్నాయుడుపేట గ్రామంలో శ్మశాన వాటిక అభివృద్ధికి నిధులు లేక సౌకర్యాలు కల్పించుకోలేక పోయామని, గ్రామంలో సుమారు 600 కుటుంబాలు స్థిర నివాసం కలిగి ఉన్నారని, ఎవరైనా మరణిస్తే దహన సంస్కారాలు చేసేందుకు సౌకర్యాలు లేకపోవడంతో నేషనల్ హైవేపైనే దహన క్రతువులు చేయాల్సి వస్తోందని వివరించారు. శ్మశాన వాటికకు రక్షణగోడతో పాటు ఇతర మౌలిక వసతులు కల్పించాలని వారు కోరారు. శ్మశాన క్రతువులు నిర్వహణకు భవనం, మంచినీటి బోరు, చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం కోసం ఎంపీ ల్యాడ్స్ నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు. ఈ సమస్యలు పరిష్కారానికి తనవంతు సమాయాన్ని అందిస్తానని ఎంపీ హామీఇచ్చారు. ఎంపిని కలిసిన వారిలో మల్లేశ్వరరావు ఉన్నారు.

క్రీడాకారులతో శిక్షకులు

ఉత్సాహంగా కరాటే పోటీలు

ప్రజాశక్తి - రణస్థలం రూరల్

మండల కేంద్రంలో జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో పరుశు రామ యుద్ధ కళాక్షేత్రం కరాటే శిక్షకుడు లింగాల ఈశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్టు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా పెన్‌కార్డ్ సెల్ ఆర్ట్ ప్రెసిడెంట్ దయామయ మాస్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల రోగాలను దూరం చేస్తుందన్నారు. కరాటే వలన ఏకాగ్రత, పట్టుదల, ఆత్మరక్షణకు తోడ్పడుతుందన్నారు. తల్లిదండ్రులు చదువుతో పాటు కరాటే మార్షల్ ఆర్ట్స్ తదితర క్రీడలను ప్రోత్సాహించాలన్నారు. అనంతరం పరుశురామ యుద్ధ కళాక్షేత్రం కరాటే శిక్షకుడు లింగాల ఈశ్వరరావు మాట్లాడుతూ కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో 25 మంది విద్యార్థులు వివిధ రకాల బెల్టులు, ధ్రువపత్రాలు పొందారని తెలిపారు. కార్యక్రమంలో ఎపి టైగర్ కరాటే ప్రెసిడెంట్ సంతోష్ కుమార్, పెన్ కాట్ సెలట్ సెక్రటరీ నక్క లక్ష్మునాయుడు, సీనియర్ మాస్టర్లు చంటి, ఫర్వేజ్, మాస్టర్ షింమారావు పాల్గొన్నారు.

బాధితునికి న్యాయం జరిగే వరకూ పోరాటం

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం నౌపడ ఎంపిటిసి లోపింటి రాములు సోదరుని కుమారుడు లోపింటి శేషరెడ్డి ఇటీవల పోర్టు వాహనాన్ని వెనక నుంచి ద్విచక్ర వాహనంతో ఢీకొని మృతి చెందారు. మూలపేట పోర్టు యాజమాన్యమే అతని మృతిపై నైతిక బాధ్యత వహించి నష్టపరహారం చెల్లించాలని వైసిపి నేతలు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడుతామని కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, నౌపడ సర్పంచ్ పిలక రవికుమార్‌రెడ్డి, ఎంపిటిసి సుధాకర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం నౌపడలోని మృతుని కుటుంబానికి పరామర్శకు వెళ్లిన నాయకులు స్థానిక విలేకరులతో మాట్లాడారు. రెండు రోజుల్లో అతనికి న్యాయం చేయకపోతే నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే వాహనాలను అడ్డుకుంటామని అన్నారు. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ స్పందించి శేషరెడ్డి కుటుంబానికి న్యాయం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. అవసరమైతే ఈ నెల 27న మూలపేట పోర్టు సందర్శనకు వస్తున్న వై.వి.సుబ్బారెడ్డిని కలిసి బాధిత కుటుంబానికి అన్ని రకాల న్యాయం చేసేందుకు సమస్యను వివరిస్తామని తెలియజేశారు. అలాగే రోడ్డుకు అడ్డంగా నిర్లక్ష్యంగా ఎక్కడపడితే అక్కడ నిలిపివేస్తూ పోర్టు వాహనాలు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయని విమర్శించారు. పరిమితికి మించి లోడుతో అతివేగంగా ప్రయాణించి మిగతా వాహనదారులకు భయభ్రాంతులకు గురి చేస్తున్నాయన్నారు. ట్రాన్స్‌పోర్టు, పోలీస్ అధికారులు వీరిపై దృష్టి సారించి ప్రమాద నివారణ చర్యలను చేపట్టాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నందిగాం ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి, చిన్ని జోగారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి నాయకులు

మంత్రుల పర్యటనకు బలవుతున్న ఉద్యోగులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అప్పలసూర్యనారాయణ

ఆదర్శవంతమైన పరిపాలన అందిస్తామని, ఎక్కడా అవినీతికి అస్కారమే ఉండదని ప్రజలకు నమ్మించే వైసిపి ప్రభుత్వం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధుల పర్యటనలకు ఎంత ఇస్తున్నారో జవాబు చెప్పాలని మాజీమంత్రి గుండ అప్పల సూర్యనారాయణ డిమాండ్ చేశారు. సత్యసాయి జిల్లాలో మడకశిర తహశీల్దార్, విఆర్ఒ లంచం తీసుకుంటూ ఆ మొత్తాన్ని ప్రజాప్రతినిధుల పర్యటనలకే ఖర్చు చేస్తున్నామని చెప్పడం ఆలోచించాల్సిన అంశమన్నారు. సోమవారం అరసవల్లిలో ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజాప్రతినిధుల పర్యటనలతో పాటు ప్రభుత్వ కార్యక్రమాలకు నిధులు వెచ్చించకుండా ఉద్యోగులపై రుద్దు తున్నారనడానికి ఇది సాక్ష్యంగా నిలుస్తుందన్నారు. వైసిపి ప్రభుత్వంలో ఉద్యోగులు వత్తిడికి గురవుతున్నారన్నారు. ఈ ఘటనలో బాధితులుగా ఉన్న ఉద్యోగులపై చర్యలు తీసుకునే ప్రభుత్వం అందుకు కారణాలను ఎందుకు బయటపెట్టడం లేదన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులు అప్పుల పాలవుతున్నారని, వారి జీతభత్యాలు కూడా సకాలంలో ప్రభుత్వం విడుదల చేయక పోవడమే ఈ దుస్థితికి కారణమవుతోందన్నారు. అధికారులు ప్రజలను పీడించడమని ప్రోటోకాల్ భారాన్ని తగ్గించుకునేందుకు ప్రభుత్వాన్ని నిలదీయాలని ఆయన సూచించారు.

జిల్లా వాకర్స్‌కు పతకాలు

పతకాలతో వాకర్స్ ప్రతినిధులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విశాఖ నగరంలో ఈనెల 23, 24 తేదీల్లో జరిగిన అంతర్జాతీయ వాకర్స్‌క్లబ్‌ల సదస్సులో శ్రీకాకుళం జిల్లా వాకర్స్‌కు పలు సేవలకుగాను పతకాలను అందజేశారు. వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు పెద్దఎత్తున నిర్వహిస్తూ ఆరోగ్య భారత్ ఆవిష్కరణలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న నడక సంఘాలను మెచ్చి ఈ పతకాలను అందజేశారు. నగరానికి చెందిన స్టార్ వాకర్స్‌క్లబ్‌కు ఉత్తమక్లబ్ అవార్డ్ దక్కింది. ఉత్తమ వాకర్స్ ఇంటర్నేషనల్ ట్రస్టు సభ్యునిగా పిజి.గుప్త ఎంపికయ్యారు. అలాగే ఓవరాల్ ఛాంపియన్‌గా స్టార్‌వాకర్స్ తరపున అధ్యక్షులు శాసపు జోగినాయుడు అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు జి.ఇందిరా ప్రసాద్, పిజి గుప్తా, కూన వెంకట రమణ మూర్తి సభ్యులను అభినందించారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో సోమవారం ఈ పతకాలను సభ్యులకు అందజేశారు.

నేడు జైత్రయాత్ర

కోటబొమ్మాళి: టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆధ్వర్యాన మంగళవారం జైత్రయాత్రను నిర్వహిస్తున్నామని టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్ తెలిపారు. పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. కోటబొమ్మాళి పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమై సంతబొమ్మాళి, తాళ్లవలస, చాకిపల్లి, టెక్కలి మీదుగా నందిగాం మండలంలోని తెంబూరు వరకు నాలుగు మండలాలను కలుపుకొని ద్విచక్రవాహనంపై ర్యాలీగా వెళ్తామని అన్నారు. నియోజకవర్గంలోని టిడిపి నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈయన వెంట కింజరాపు హరిప్రసాద్, వెలమల కామేశ్వరరావు, తర్ర రామకృష్ణ, ఎస్.రాంకుమార్, కోరాడ గోవిందరావు ఉన్నారు.

ప్లాటినం అవార్డు అందజేస్తున్న సభ్యులు

పోలియో రహిత సమాజమే లక్ష్యం

సోంపేట: పోలియో రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రోటరీ అధ్యక్షుడు శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం నిర్వహించిన పోలియో అవగాహనా సెమినార్‌లో పాల్గొని మాట్లాడారు. రోటరీ ఆధ్వర్యాన పోలియో నిర్మూలనకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం తిరుమలరావు, రోటరీ క్లబ్ సభ్యులు రూ.లక్ష చొప్పున విరాళం అందజేశారు. ఆర్థికసాయం అందించడంతోపాటు పోలియో రహిత సమాజం కోసం కృషి చేస్తున్న శ్రీనివాస రావుకు సభ్యులు ప్లాటినం అవార్డును అందజేశారు. భరత కుమార్‌రెడ్డి, రావూరి సుబ్బారావు, జిఎం రామారావు, డాక్టర్ ఎం.వి.రావు, శివశంకర్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

పేద కుటుంబానికి 'చేయూత'

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని గోవిందపురం పంచాయతీ ఎస్‌టి కాలనీకి చెందిన పేద కుటుంబానికి దాతలు ఆర్థికంగా చేయూత సోమవారం అందించారు. చేయూత సంస్థ సభ్యులు మెట్ట భోగేశ్వరరావు, సర్పంచ్ ప్రతినిధి పాలిన చిరంజీవి గేదెల గౌరమ్మ కుటుంబాన్ని కలిసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కొద్ది రోజులు కిందట తన భర్త మృతి చెందడంతో ఎటువంటి ఆదరువు లేకపోవడంతో ఇద్దరు ఆడపిల్లలు సాకడం భారమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన సభ్యులు రూ.పది వేలు నగదుతో పాటు మూడు వేలు విలువ చేసే నిత్యావసర సరుకులను అందచేశారు.కార్యక్రమంలో గ్రామస్తులు కణితి వెంకట, భగవాన్ పాల్గొన్నారు.

సోంపేట : ఇటీవల ప్రమాదాన్ని గురై ఇబ్బందులు పడుతున్న కొర్లాంకు చెందిన సత్య కుటుంబ సభ్యులకు హెల్పింగ్ హాండ్ సభ్యులు చేయూత అందించారు. సత్య కుటుంబ సభ్యులకు రూ.7 వేలు నగదు అందజేశారు.

'ఆడుదాం ఆంధ్రా' ఏర్పాట్లు పరిశీలన

ఇచ్ఛాపురం : స్థానిక సురంగి రాజా క్రీడా మైదానంలో మంగళవారం నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా క్రీడాకారులకు ఏర్పాటు చేసిన అవసరమైన కోర్టులను మున్సిపల్ కమిషనర్ రమేష్ సోమవారం పరిశీలించారు. ఈయన వెంట వ్యాయామ ఉపాధ్యాయులు జోన్-1 అధ్యక్షులు కె.పద్మనాభరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

అప్పన్నకు నివాళి

టెక్కలి : టెక్కలి పట్టణ తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు కోళ్ల అప్పన్న 8వ వర్ధంతి వేడుక టిడిపి కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ముందుగా అప్పన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు అప్పన్న సేవలను కొనియాడారు. టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరి, మహిళా అధ్యక్షులు మెండ దమయంతి, నాయకులు హనుమంతు రామకృష్ణ, చాపర గణపతి, మామిడి రాము, బెహరా కాళీ, మట్ట పురుషోత్తం, కోళ్ల లవకుమార్ పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

మెళియాపుట్టి : మండలంలో భరణికోట పంచాయతీ లోని వంద మంది గిరిజన కుటుంబాలకు విజయనగ రానికి చెందిన విశ్రాంత వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.వెంకటరమణ సోమవారం దుస్తుల ను పంపిణీ చేశారు. ఆయన తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా ఉచితంగా దుప్పట్లు, చీరలు, లుంగీలు, టవాళ్లు, టీషర్టు వంటివి అందజేశారు. అలాగే బమ్మిడి చక్రపాణి ఆధ్వర్యాన అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ పెద్దలు పాల్గొన్నారు.

దుస్తులను పంపిణీ చేస్తున్న వెంకటరమణ

చెత్త దుకాణంతో అవస్థలు

జనావాసాల మధ్య ఉన్న చెత్త సామగ్రి దుకాణం

కోటబొమ్మాళి : స్థానిక కోమటివీధిలో గత కొనేళ్ళగా అదే వీధికి చెందిన నాగేశ్వరరావు అనే వ్యక్తి చెత్తసామాన్ల దుకాణం నడుపుతున్నాడు. అయితే అన్నిరకాల వ్యర్థ సామాగ్రి కుప్పలు తెప్పలుగా ఇళ్లమధ్యలో వేయడంతో స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతుంది. వీటివలన చీకటిపడితే విషసర్పాలు సంచరించడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి పాత సామాన్లు కొనుగోలు చేసి తీసుకురావడంతో పాడుపడ్డ సామాన్లు నుంచి విషసర్పాలు బయటకు వస్తున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. పాడుపడిన, నిల్వఉన్న పుస్తకాలు, అట్టలు, ప్లాస్టిక్ వస్తువులు వానలకు తడిచి దుర్గంధపు వాసన వస్తుందని దీనిపై అధికారులు స్పందించి ఈ దుకాణం గ్రామానికి దూరంగా ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

బాబుతోనే భవిష్యత్

కోటబొమ్మాళి: చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టిడిపి బెండి అన్నపూర్ణ అన్నారు. మండలంలోని శ్రీజగన్నాథపురం పంచాయతీ బిర్లంగిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టోతో కూడిన పోస్టర్లను అందజేశారు. తల్లికి వందనం పేరుతో పిల్లలకు ఏడాదికి రూ. 15వేలు, ఆడబిడ్డ నిధి నుంచి 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ నెలకు రూ.1500లు, దీపం పేరుతో ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుగ్యోగులకు యువగళం నిధి నుంచి నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి, ప్రతి రైతుకు ఏటా రూ. 20 వేలు ఆర్థికసాయం వంటి పథకాలు చంద్రబాబు అమలు చేస్తారని వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొర్రాయి మల్లేష, సాసుమంతు ఆనంతరావు పాల్గొన్నారు.

పోస్టర్‌ను అందజేస్తున్న అన్నపూర్ణ

ఘనంగా వాజ్‌పేయి జయంతి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండల కేంద్రంలో సోమవారం మాజీ ప్రధాని స్వర్గీయ అటల్ బిహారి వాజ్‌పేయి జయంతి నిర్వహించారు. విజయనగరం జిల్లా బిజెపి అధ్యక్షులు నడుకుదిటి ఈశ్వరరావు వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన జీవితాంతం దేశాభివృద్ధి కోసం కృషి చేశారన్నారు. ప్రధానిగా వాజ్‌పేయి తీసుకున్న పలు చారిత్రాత్మక నిర్ణయాలు దేశచరిత్రలో చెరగని ముద్ర వేశాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ నడుకుదిటి రజని, నాయకులు పివి రత్నం, దుక్క ఆదినారాయణ, మన్నె సురేష్ కుమార్, టొంపల అప్పలరాజు, మన్నె కృష్ణానందం పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : పట్టణంలో బిజెపి నేతలు వేర్వేరుగా మాజీ ప్రధానమంత్రి కీర్తిశేషులు వాజపేయి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ మేరకు బస్టాండ కూడలి వద్ద ఇన్‌ఛార్జి బుద్దలా నిర్మలారెడ్డి వాజపేయి చిత్రపటానికి సోమవారం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అలాగే వికెపి ఫంక్షన్ హాల్‌లో వాజ్‌పేయి వర్ధంతి, సూపరిపాలన దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వల్లంపాటి కృష్ణప్రసాద్, జగన్మోహన్‌రెడ్డి, బాబూరావు, కేశవ పాల్గొన్నారు.

ప్రజలకు చేరువగా ప్రభుత్వ వైద్యం

పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బంది

ప్రజాశక్తి- కవిటి

ప్రభుత్వ వైద్యం ప్రజలకు చేరువవుతోంది. కిడ్నీ ప్రభావిత ప్రాంతమైన మండలంలో ఇది ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారుతోంది. ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించడంతో మండలంలోని అన్ని ప్రభుతాస్పత్రుల్లో పూర్తిస్థాయి సిబ్బందితో వైద్య సేవలు అందించడమే కాకుండా 104 వాహనాలతో గ్రామాల్లో వైద్య సేవలు అందిస్తూ ప్రభుత్వ వైద్యాన్ని ప్రజలకు చేరువచేసింది. ముఖ్యంగా కిడ్నీ వ్యాధి ప్రభావం అధికంగా ఉన్న మండలంలో ఇది ఎంతో ఉపయోగపడుతోందని రోగులు అంటున్నారు. వచ్చే వ్యాధిపై సరైన అవగాహన లేకపోవడం, తరుచుగా వాడే నొప్పి మందులు, విచ్చల విడిగా వినియోగిస్తున్న ఫాస్టుఫుడ్ స్థానికంగా ప్రజల్లో చాలా అనారోగ్య సమస్యలకు కారణమవుతున్నట్లు చాలా పరిశోధనల్లో వెల్లడైంది. వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మండలంలోని అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో పూర్తిస్థాయి వైద్యులతో పాటు సిబ్బందినీ నియమించింది. అయితే ఇప్పటికీ చాలామంది ప్రజలు తమకు అనారోగ్యం వస్తే ఆర్ఎంపి డాక్టర్లను కానీ, ప్రయివేటు వైద్యులను కానీ సంప్రదిస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా ఎప్పటిలాగే మెడికల్ షాపుల్లో సొంతంగా మందులు తీసుకుని వాడుతున్నట్లు ఇటీవల జరిగిన కొన్ని సర్వేల్లో వెల్లడైంది. దీనిపై కవిటి సిహెచ్‌సి సుపరింటెండెంట్ డాక్టర్ రాంజీని సంప్రదించగా, మండలంలో పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అయినప్పటికీ ఇంకా కొంతమంది ప్రజలు ప్రయివేటు ఆస్పత్రులు, ఆర్ఎంపి డాక్టర్లను సంప్రదిస్తూ సొంతంగా మందులు వాడుతున్నట్లు తెలుస్తోందని అన్నారు. కవిటి సిహెచ్‌సిలో ఇద్దరు ఎంబిబిఎస్ వైద్యులు, ఒక బిడిఎస్, జనరల్ మెడిసిన్, పిల్లల వైద్యుడు, జనరల్ సర్జన్ విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెడ్ నర్స్ ఒకరు, ఎన్‌హెచ్ఎం నర్సులు ఇద్దరు, స్టాఫ్‌నర్సులు ఆరుగురు నిరంతరం వైద్య సేవలు అందిస్తున్నట్లు రాంజీ తెలిపారు. అలాగే మండలంలోని నాలుగు పిహెచ్‌సిల్లో ఇద్దరేసి చొప్పున ఎంబిబిఎస్ వైద్యులు రోగులకు అందుబాటులో ఉన్నట్లు వివరించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి పూర్తిస్థాయిలో ప్రభుత్వ వైద్య సేవలు వినియోగించుకోవాలని కోరారు. ముఖ్యంగా ఉద్దానం ప్రాంతంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, కిడ్నీ వ్యాధి తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది నిరంతరం ప్రజలకు వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రజలు తమకు ఎటువంటి అనారోగ్య సమస్య ఎదురైనా మెడికల్ షాపులు, సంచి డాక్టర్ల వద్దకు పరుగులు పెట్టకుండా ప్రభుత్వ వైద్యం పొందాలన్నారు. ముఖ్యంగా ఉద్దానం ప్రాంతంలో ఉన్న కిడ్నీ వ్యాధిని దృష్టిలో ఉంచుకుని వ్యవహరించాలని సూచించారు. మరోవైపు జిల్లాలో కరోనా కేసు నమోదైన దృష్ట్యా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ రాంజీ సూచించారు. భౌతిక దూరం పాటిస్తూ, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, అవసరమైన సమయంలో మాస్కు తప్పనిసరిగా వాడాలని సూచించారు.

వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ శశిధర్

రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రాంజీ